క్లుప్తంగా

నల్ల గంగమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో మల్లూరమ్మ తల్లి

సంబేపల్లి : మండల కేంద్రంలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసిన శ్రీ మల్లూరమ్మ తల్లికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు పలు పూజలను నిర్వహించారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు.

అమ్మవారికి కిలో వెండి వితరణ

లక్కిరెడ్డిపల్లి : అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లికి లక్కిరెడ్డిపల్లి మండలం, అప్పకొండయ్యగారి పల్లికి చెందిన రామచంద్ర కుటుంబసభ్యులు ఆదివారం కిలో వెండిపళ్లెంను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి మారుతీ ప్రసాద్, ఆలయ సిబ్బందికి వెండి హారతి పళ్లెం, కుంకుమ భరిణి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం రామచంద్ర, చెల్లు వంశీయులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్‌లో విద్యార్థి సత్తా



విశ్వతేజ

రైల్వేకోడూరు అర్బన్: పూణెలో గత నెల 31న జరిగిన జూనియర్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ అండర్-19 డబుల్స్ గ్రాండ్ ఫైనల్‌లో జరిగిన పోటీల్లో రైల్వే కోడూరుకు చెందిన గొబ్బూరు నరేంద్ర కుమారుడు విశ్వతేజ విజయం సాధించాడు. పూణెలో జరిగిన జూనియర్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్‌లో చైనా దేశంతో తలబడి విజయం సాధించినట్లు గొబ్బూరు నరేంద్ర తెలిపారు. విశ్వతేజను స్థానికులు, స్నేహితులు, క్రీడాభిమానులు అభినందించారు.

రాయచోటిలో ప్రజా దర్బార్



ప్రజా దర్బార్‌లో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్ : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం రాయచోటి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించిన ఆయన.. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా దర్బార్‌లో ప్రజల వినతులను పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు. అధికారులు బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పార్టీ కార్యకర్తలు, అభిమానులు మంత్రిని ఘనంగా సత్కరించారు.

రక్తదానం మహాదానం



రక్త దానం చేస్తున్న యువకులు

రైల్వేకోడూరు అర్బన్ : అత్యవసర సమయాల్లో ప్రాణాలను తిరిగి తెచ్చే రక్తాన్ని దానంగా ఇవ్వడం మహాదానం అని వాసవిక్లబ్ గవర్నర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పెండ్యాల విజయకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు తిరునామాల కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత రక్తదానంలో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేమా కిషోర్‌బాబు, గాదంశెట్టి సుమన్ కుమార్, సత్యనారాయణ, గోపి, సత్య, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతి.. మనసా స్మరామి

విఘ్నాలు తొలగాలని విఘ్నేశ్వరుడిని పూజిస్తుంటారు. కానీ వినాయక ఉత్సవాలను మాత్రం రసాయనాలతో చేసిన విగ్రహాలను కొలువుదీరుస్తాం. చవితి వేడుకల హడావుడిలో ఆకర్షణీయంగా కనిపించే రసాయన విగ్రహాల ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ) వలన జరిగే పర్యావరణ హాని గురించి మరచిపోతున్నారు. పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. నీటి వనరుల కాలుష్యాన్ని పెంచుతున్న ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ మోజు నుంచి మట్టి ప్రతిమల వైపు మొగ్గు చూపాలని కోరుతున్నారు.


- మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ
- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో మానవ మనుగడకు ముప్పు
- రసాయన రంగులతో వ్యాధులు సోకే ప్రమాదం
- మట్టి ప్రతిమలు శ్రేయస్కరం



రైల్వేకోడూరు అర్బన్ : వినాయక చవితి వచ్చేస్తుంది. వీధివీధినా గణనాథులు కొలువుదీరి పూజలు అందుకొనున్నారు. ఈ నెల 7న శనివారం వినాయక చవితి వేడుకలకు గ్రామాల్లో యువకులు ఏర్పాట్లు చేసుకొంటున్నారు. యువత ఎంతో ఉత్సాహంగా నిర్వహించే ఈ ఉత్సవాలలో మట్టి వినాయకులను పూజించడమే శ్రేష్టమని పెద్దలు, పర్యావరణ వేత్తలు హితవు పలుకుతున్నారు. గ్రామాలు, పట్టణాలలో వినాయక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు సిద్ధం చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో దాదాపు 1,000కి పైగా మండపాలు ఈ ఏడాది ఏర్పాటు చేయనున్నారు. ఇవి గాక ప్రతి ఇంట వినాయక ప్రతిమలతో పూజలు చేస్తారు. ప్రతిమలు అందం, ఆకర్షణగా ఉండడానికి రంగురంగుల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వాడిన విగ్రహాలను వినియోగిస్తుంటారు. వీటిని చెరువులలో, ఏర్లలో నిమజ్జనం చేస్తారు. ఇదే పర్యావరణానికి పెద్ద సమస్యగా మారుతుంది. పర్యావరణాన్ని కాపాడే ఏకో వినాయకులను పూజించాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ఏర్పాటు చేసుకొని ఉత్సవాలను వైభవంగా జరుపుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే కొంత మంది పర్యావరణ ప్రేమికులు, పలు స్వచ్ఛంద సంస్థల వారు మట్టి విగ్రహాలను పూజించాలంటూ ప్రచారం చేస్తున్నారు. కొన్ని చోట్ల ఉచితంగా కూడా పంపిణీ చేస్తున్నారు.

రసాయనాల వలన అనర్థాలు

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలు నీటిలో తొందరగా కరగవు, ప్రతిమలలో జిప్సం, గంధకం, మెగ్నీషియం, పాదరసం, సీసం, కాడ్మియం, కార్బన్ వంటి ఆవశేషాలు ఉంటాయి.
- విగ్రహాలకు పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువులకు జీర్ణ కోశ వ్యాధులు సంక్రమిస్తాయి.
- నీటిలో ఉండే చేపలు, జలచరాలు వ్యాధుల బారిన పడి నశించి పోతాయి.
- రసాయనాలు కలిసిన నీటి మూలంగా శరీరంలో నరాలపై ప్రభావం చూపి కేన్సర్, చర్మ వ్యాధులు వస్తాయి.
- ఈ నీరు పంట పొలాలలోకి చేరి దిగుబడులు తగ్గించడమే కాక ఆహార ఉత్పత్తులను కలుషితం చేస్తుంది.



మట్టి విగ్రహాల వలన ప్రయోజనాలు

- సహజ సిద్ధంగా లభించే బంక మట్టితో విగ్రహాలు తయారు చేసుకోవడం వలన ఈ విగ్రహాలు నీటిలో కరిగిపోతాయి.
- మట్టి వినాయక విగ్రహాలతో నీటి వనరులకు, మానవాళికి, జంతు జీవాలకు ఎలాంటి ముప్పు ఉండదు.
- చెట్ల ఆకులు, బెరడుతో తుయారు చేసే రంగులను మట్టి బొమ్మలకు అద్ది చూడచక్కగా తయారు చేసుకోవచ్చు.
- ఈ మిశ్రమం నీటిలో కరగడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. నీరు, నేల, గాలి అన్నింటిపై కాలుష్య ప్రభావం చూపుతుంది.

ప్రకృతినే దేవుడు ప్రేమిస్తాడు



హిందువులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే పండుగ వినాయక చవితి. సాధారణంగా ప్రకృతినే దేవుడు ప్రేమిస్తాడు. ప్రకృతిలో భాగమైన మట్టితో గణపతిని విగ్రహాన్ని తయారు చేసి పూజించాలి. ఈ వేడుకలలో మట్టి వినాయక విగ్రహాలను పూజించడం వలన పర్యావరణాన్ని కాపాడవచ్చు.

-డాక్టర్ సురేష్‌శర్మ, పీహెచ్‌డీ, తెలుగు అధ్యాపకులు, రైల్వేకోడూరు

పర్యావరణానికి ముప్పు



ప్రస్తుతం గణపతి విగ్రహాలలో మితిమీరిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ వాడడంతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోంది. విగ్రహాలను చెరువులు, నదుల్లో నిమజ్జనం చేయడం వలన పర్యావరణానికి, పచ్చదనానికి ముప్పు వాటిల్లుతుంది.

-కోటకొండ శివకుమార్, పర్యావరణ, వృక్షశాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, రైల్వేకోడూరు

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



వేడుకలు ఎంత ముఖ్యమో, పర్యావరణం, ఆరోగ్యం కూడా కూడా అంతే ముఖ్యము. కాబట్టి ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో చేసే ప్రతిమలకు దూరంగా ఉండాలి. దీని వాడకం వలన వాతావరణం కలుషితమవుతుంది. భయంకరమైన జబ్బులు వచ్చే ప్రమాదముంది.

- డాక్టర్ వెంగల్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు, రైల్వేకోడూరు మండలం

నేడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి

పుల్లంపేట: పుల్లంపేటలోని బైపాస్ వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముస్తాక్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

గాలివీడులో..

గాలివీడు : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి కార్యక్రమంలో గాలివీడులో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు గాలివీడు బస్టాండులోని వైఎస్సార్ విగ్రహానికి భారీ పూల మాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

4న సర్వసభ్య సమావేశం

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 4న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల ఎంపీడీఓ రెడ్డయ్య తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీలు హాజరు కావాలని ఆయన కోరారు.

దళిత మిత్ర సంఘం ఎన్నిక

సంబేపల్లె : దళితుల అభ్యున్నత కోసం దళిత మిత్ర సంఘాలను ఏర్పాటు చేసుకొంటున్నట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి నాగభూషణం పేర్కొన్నారు. దళిత మిత్ర వ్యవస్థాపకుడు రామాంజనేయులు ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంలో సంబేపల్లె మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా సి. యువరాజు, ఉపాధ్యక్షుడిగా యం, వెంకటరమణ ఎన్నుకున్నారు. అదే విధంగా కలకడ మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప, ఎంపీటీసీ రామరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు



రమణయ్యను సన్మానిస్తున్న శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు

రాయచోటి టౌన్ : ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తోందని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధి గరుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులు రమణయ్య పదవీ విరమణ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు నాగప్రభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక, విద్యా రంగాల్లో ఉత్తమ సేవలు అందించినప్పుడే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు నైతిక విలువలు, సామాజిక స్పృహ, శాస్త్రీయత గురించి వివరించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు, బంధుమిత్రులు రమణయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ నరసింహారెడ్డి, గరుగుపల్లి సర్పంచ్ వాసు, ఏపీటీఎఫ్ నాయకులు హరిబాబు, విశ్రాంత ప్రిన్సిపాల్ ఓబన్న, గాలివీడు ఎంఈఓ -2 శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



రమణయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఓబులవారిపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు రమణయ్య పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ గొప్పవాళ్లు ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నతస్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. అనంతరం ఎస్టీయూ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు రమణయ్యతో వారికున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం రమణయ్య దంపతులను ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపారు. జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, ఆర్‌ఐపీ భాను ప్రకాష్ రాజు, మాజీ ఎంఈఓ చెంగల్ రెడ్డి, మాజీ ప్రధానోపాధ్యాయుడు వేణు గోపాల్, ఎస్టీయూ నాయకులు గద్దం ఆదినారాయణ రెడ్డి, ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడులపై నిరసన



నిరసన ప్రదర్శన చేస్తున్న సీఐటీయూ నాయకులు

రాయచోటి అర్బన్ : పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ ఆదివారం రాయచోటిలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు సి.హెచ్. చంద్రశేఖర్, పి.శ్రీనివాసులు, ఎ.రామాంజులు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదుల సహకారంతో పాలస్తీనాపై దురాక్రమణకు దిగుతున్న ఇజ్రాయిల్ వైఖరిని ప్రతిఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రులు, పాఠశాలలపై ఇజ్రాయిల్ క్షిపణులతో దాడి చేయడం దారుణమన్నారు. ప్రపంచదేశాలు జోక్యం చేసుకుని పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యత్నాలను అడ్డుకోవాలంటూ కోరారు. కార్య క్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వి.రమణ, సభ్యులు రాజేశ్వరి, శ్రీలక్ష్మి, సుజాత, ఐద్వా జిల్లా కన్వీనర్ యం.భాగ్యమ్మ, ఖాజాబీ, మాధవయ్య పాల్గొన్నారు.

నీలి మేఘమా.. జాలి చూపుమా



రాష్ట్రంలో తుఫాన్‌తో అనేక ప్రాంతాలు అతలాకుతలమవుతుంటే పెనగలూరు మండలంలో తుంపరతో సరిపెట్టుకుంది. గత నెల రోజులుగా వేసవి తలపించిన ఎండలు కాయడంతో బోర్లలో కూడా నీరు అడుగంటింది. వర్షంకోసం ఎదురు చూస్తున్న రైతన్నలకు ఈ తుఫాను నిరాశ మిగిల్చింది. గత రెండు రోజులుగా ఆకాశంలో మబ్బులు ఉన్నా భూమి మీద చినుకు మాత్రం పడలేదు. రెండురోజులుగా తుఫాను ప్రభావం ఉన్నా పదును వాన కూడా కురవకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. మబ్బులు మాత్రం పెద్దఎత్తున దర్శనమిస్తూ తుంపర్లు మాత్రమే పడుతున్నాయి. సమృద్ధిగా వర్షాలు పడకపోవడం.. ఏరోజుకారోజు మబ్బులు పట్టడం ఆతర్వాత వదిలేస్తుండటంతో వానాకాలం సాగు పనులు ముందుకు సాగడంలేదు. ఇప్పటికే మండలంలో కరువుఛాయలు కనబడుతున్నాయి.

–పెనగలూరు

రైతుల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి అర్బన్: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.యల్. నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుకోర్కెల దినోత్సవం సందర్భంగా బస్టాండు సర్కిల్‌లో రైతుసంఘం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం లేక, గిట్టుబాటు ధరలు లభించక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రైతులకు సరైన మార్కెటింగ్ వసతులు, గిట్టుబాటు ధరను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లాకమిటీ సభ్యుడు సుధీర్‌కుమార్, నేతలు సిద్దారెడ్డి, శేఖర్‌రెడ్డి, రమణయ్య, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

గాలివీడు : లైయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి, శ్రీ వేంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య మెగా శిబిరానికి విశేష స్పందన లభించినట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి వ్యవస్థాపక అధ్యక్షుడు జీఎంటీ కోఆర్డినేటర్ పీఎస్ హరినాథ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, లయన్స్ ఉపాధ్యక్షుడు రామంజనేయరెడ్డి, రాష్ట్ర వాల్మీకి సంఘం యూత్ అధ్యక్షుడు బండి వెంకటసాయి పరశురాం తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన ఒంటిమిట్ట వైఎస్సార్‌సీపీ నాయకులు

ఒంటిమిట్ట : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పులివెందలలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి ఆధ్వర్యంలో ఒంటిమిట్ట వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, సాలాబాదు మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు తెలిపారు.

బీడు భూముల సాగుకు ప్రత్యేక ప్రణాళిక



వరి పంటను పరిశీలిస్తున్న బద్వేల్ ఏడీఏ నాగరాజ

సిద్దవటం : గ్రామాల్లోని బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రి నాగరాజ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని రైతుసేవా కేంద్రాన్ని ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జంగాలపల్లె రెవెన్యూ గ్రామం పరిధిలో ఇ- పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఇ- పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. నమోదు ప్రక్రియ ఈనెల 15వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. వరి సాగులో పొటాష్ తప్పనిసరిగా 25-30కి లోలు పొట్ట దశలో వాడాలని సూచించారు. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం అంకన్న

లక్కిరెడ్డిపల్లి : సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లి మండలం, దప్పేపల్లి గ్రామ పంచాయతీ, జాంద్రపల్లెలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పారిశుద్ధ్యం లోపించి డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులతో ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాంద్రపల్లి ప్రజలు చంద్రశేఖర్, స్వరూప్, తేజ పాల్గొన్నారు.

జీవామృతంతో పంటలకు మేలు



జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది

చిన్నమండెం : జీవామృతం వల్ల రైతుల పొలంలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది పంటలకు మేలు జరుగుతుందని మండల పాయింట్ పర్సన్ సుబ్రమణ్యం ఆచారి అన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేస్తున్న వేరుశనగ పంటను పరిశీలించారు. రైతులకు వేరుశనగలో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో పశువుల పేడ ఉంటుందని, దీంతో ద్రవ జీవామృతం తయారు చేసి పశువుల పేడపై చల్లి బాగా కలియదిప్పాలని, అలా చేస్తే బ్యాక్టీరియా ఎక్కువ వృద్ధి చెంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి రమణ, డిజిటల్ యూనిట్ ఇన్‌చార్జి వెంకటమల్లయ్య, ఐసీఆర్‌పీలు ఇంద్రావతి, కృష్ణమ్మ, రమాదేవి, గ్రామ సంఘం అధ్యక్షురాలు నాగస్వాతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

నందలూరు: భారతీయ జనతా పార్టీ అయిదేళ్ల తర్వాత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతోంది. నేటి నుంచి మండలంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంపై రాజంపేట అసెంబ్లీ కో-కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. రమేష్ నాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోనూ పట్టు సాధించే లక్ష్యంతోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.